సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.7 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.16

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.9 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 1,650 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం

34.9°/21.2°

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'హోంవర్క్' చేయలేదని.. పారిపోయిన విద్యార్థినులు

- గంటలో పట్టుకున్న ధర్మవరం వన్‌టౌన్ పోలీసులు



విద్యార్థినులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్

ధర్మవరం అర్బన్: హోంవర్క్ చేయని తమను టీచర్ కొడుతుందన్న భయంతో ఇద్దరు విద్యార్థినులు స్కూల్ నుంచి పారిపోగా, పోలీసులు గంటలోనే వారి ఆచూకీ కనిపెట్టి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వివరాల్లోకి వెళితే... పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ధరణి, కృష్ణప్రియ ఆరో తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ మంగళవారం హోంవర్క్ చేయలేదు. దీంతో టీచర్ కొడుతుందేమోనని భయపడి మధ్యాహ్నం స్కూల్ నుంచి పారిపోయారు. దీంతో స్కూల్ టీచర్లు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు వెంటనే వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ వెంటనే స్పందించి విద్యార్థినుల కోసం ముమ్మరంగా గాలించారు. రైలు ఎక్కి ఎటైనా వెళ్లిపోవాలని నిర్ణయించుకుని రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న విద్యార్థినులను పీఆర్‌టీవీధిలో గుర్తించారు. వారికి మంచిమాటలు చెప్పి స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం తల్లిదండ్రులను పిలిపించి విద్యార్థినులను అప్పగించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

పుట్టపర్తి అర్బన్: అపరిష్కృతంగా ఉన్న అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా సమితి, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఐసీడీఎస్ పీడీ ప్రమీలకు వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు జీతాలు పెంచాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని, కొత్త ఫోన్లను ఇవ్వాలని, కక్ష సాధింపులు వీడాలని డిమాండ్ చేశారు. మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని కోరారు. డిమాండ్లను నెరవేర్చకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షురాలు మాబున్నీషా నాయకులు పాల్గొన్నారు.

- ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఓడీసీ (ఓబుళదేవర చెరువు) బస్టాప్‌లోకి వచ్చిన మహమూద్ బాషాకు 5 బస్సులు ఆపలేదు. చివరకు చచ్చీ చెడీ కదిరికి రావాల్సి వచ్చింది. మళ్లీ కదిరి నుంచి అనంతపురం రావడానికి 5 గంటల సమయం పట్టింది.
- బత్తలపల్లి – ముదిగుబ్బ మధ్యలో ఉండే రాళ్ల అనంతపురంలో ఐదుగురు మహిళలు సోమవారం బస్టాప్‌కు వస్తే వరుసగా వచ్చిన నాలుగు బస్సులు ఆపలేదు. మూడు గంటలు అక్కడే నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది.
- నాయనిపల్లి క్రాస్‌నుంచి రోజూ ఐదారుగురు ఉపాధ్యాయులు తాడిపత్రికి వెళతారు. అనంతపురం నుంచి బయలుదేరిన బస్సులు అప్పటికే ఫుల్ అయ్యాయని నాయనిపల్లి క్రాస్‌లో నిలపడం లేదు. దీంతో వాళ్లు స్కూలుకెళ్లడం గగనమవుతోంది.



అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులో సీట్ల కోసం అగచాట్లు

కష్టాలు ఉచితం

ఉక్కిరి బిక్కిరి..

- ఆర్టీసీ సర్వీసులు తగ్గించిన అధికారులు
- ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్న బస్సులు
- ఉచితమే కదా అని స్టాపుల్లో మహిళలున్నా ఆపని వైనం
- డబ్బులిచ్చి వెళదామన్నా తగినన్ని బస్సుల్లేవంటున్న పురుషులు
- బిక్కుబిక్కుమంటూనే ప్రయాణం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆర్టీసీలో ఉచిత ప్రయాణం నరకం చూపిస్తోంది. వచ్చిన బస్సులు ఆగవు.. కొత్తవి రావు.. ఏం చేయాలో తెలియక ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. స్త్రీశక్తి పేరుతో ప్రారంభించిన ఈ సేవలు మహిళల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. ఆర్టీసీ బస్టాండులలో మొదలయ్యే బస్సులు మండల కేంద్రాల్లోని బస్టాపుల్లో సైతం ఆపకపోవడం, ఉన్న బస్సులు తగ్గించడంతో జాప్యం వెరసి తమ సహనాన్ని సర్కారు పరీక్షిస్తోందని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళలు వాపోతున్నారు. ఓవైపు మహిళల్ని చూస్తే బస్సులాగక పోగా.. డబ్బులిచ్చి బస్సెక్కుదామనే పురుషులకూ ఇప్పుడు బస్సుల్లేకపోవడంతో ఉద్యోగులు మొదలుకొని వృద్ధుల వరకు యాతన పడుతున్నారు.

ప్రయాణమంటే భయమేస్తోంది

'పది రూపాయలు ఖర్చయినా సరే ప్రశాంతంగా ప్రయాణం చేసి వచ్చేవాళ్లం.. ఇప్పుడు 'నరకం' చూస్తున్నాం' అంటున్నారు ప్రయాణికులు. ఉమ్మడి జిల్లాలో మహిళలు ఎక్కువ మంది ప్రయాణిస్తున్నారని బస్సులు తగ్గించారు. ముందు స్టాపులో ఫుల్ అయిందని రెండు, మూడు, నాలుగవ స్టాపుల్లో ఆపడం లేదు. అంతర్రాష్ట్ర సర్వీసుల్లో అనుమతి లేదు. సూపర్ లగ్జరీ ఎక్కడానికి లేదు. ఒక్కోసారి అనంతపురం బస్టాండులోనే బస్సు ఫుల్ అయితే గమ్యస్థానం వరకూ ఆపడం లేదు. మధ్యలో వేచి చూసే ప్రయాణికుల సంగతి పట్టించుకోవడం లేదు.

ఉద్యోగులకు నరకం

ఉద్యోగులు రోజూ అనంతపురం నుంచి ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి ఇలా పలు చోట్లకు ప్రయాణం చేస్తూ సాయంత్రం ఇంటికొస్తారు. గతంలో ఉదయం 7:30కి బస్సెక్కితే స్కూలు లేదా ఆఫీసు సమయానికి చేరుకునేవారు. కానీ ఇప్పుడు బస్సులు లేక, ఉన్న బస్సుల్లో నిల్చునేందుకు కూడా చోటులేక అల్లాడుతున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు అయితే డబ్బులిచ్చి వెళదామన్నా బస్సుల్లేవని వాపోతున్నారు. అనంతపురం డిపో నుంచి బయలుదేరే బస్సు ఎక్కితేనే ప్రయాణం.. లేదంటే మధ్యలో బస్సు ఆగుతుందనుకుంటే బొక్కబోర్లా పడ్డట్టేనని వాపోతున్నారు.



బస్సు ఎక్కుతున్న మహిళా ప్రయాణికులు

అనంతపురం జిల్లాలో ఆర్టీసీ సేవలు

జిల్లా జనాభా	24.90 లక్షలు
మహిళల జనాభా	13.40 లక్షల పైనే
జిల్లాలో గ్రామాలు	1,131
మొత్తం ఆర్టీసీ డిపోలు	07
డిపోల్లో ఉన్న బస్సులు	512
బస్సు సర్వీసులున్న గ్రామాలు	453
కొత్తగా నడపాల్సిన సర్వీసులు	65

గంట వేచి ఉన్నా సీటు దొరకలేదు



నేను నా కొడుకుతో కలిసి అనంతపురం వెళ్లేందుకు కళ్యాణదుర్గంలోని టీ సర్కిల్ సమీపంలోని సిటీ ప్యాలెస్ దగ్గరికి వచ్చాను. గంట సేపు వేచి ఉన్నా వచ్చిన బస్సులన్నీ బస్టాండ్ నుంచే జనాలతో కిక్కిరిసి వచ్చాయి. ఎక్కుదామంటే కండక్టర్లు 'వెనుక ఖాళీ బస్సు వస్తుంది చూడమ్మా' అంటున్నారు. ఇలా నాలుగైదు బస్సులు పోయాయి. ప్రభుత్వమేమో ఫ్రీ బస్సు అని చెప్పింది. కానీ దానికి అనుగుణంగా బస్సుల సంఖ్య కూడా పెంచితే మేలు.

– లలితమ్మ, ప్రయాణికురాలు, కళ్యాణదుర్గం

ఇలా అయితే ప్రయాణమెలా..?



నేను కుందుర్పి నుంచి కళ్యాణదుర్గం వెళ్దామని ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు బస్టాండ్‌కు వచ్చాను. బస్సు రాగానే జనాలు ఎగబడ్డారు. నేను ఎక్కుతున్న సమయంలోనే కండక్టరు 'సీట్లు లేవు వెనుక బస్సుకు రండి' అని చెప్పారు. అసలే బస్సు సర్వీసులు తక్కువగా ఉంటున్నాయి. ఇలాగైతే ప్రయాణాలు ఎలా చేయాలి?

– కవిత, తూముకుంట, కుందుర్పి మండలం

బస్సులు ఆపడం లేదు



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అని ప్రకటించినప్పటి నుంచి మహిళలను చూస్తే బస్సులు ఆపడంలేదు. బస్ స్టాప్‌లోకి వచ్చి బస్సులు ఎక్కాలని, ఎక్కడంటే అక్కడ ఆపేది లేదని డ్రైవర్లు, కండక్టర్లు కరాఖండిగా చెబుతున్నారు. చంటి పిల్లలతో ఆడవారు కనిపించినా ఆపడం లేదు. ఇది వరకు ఎక్కడ చేయి ఎత్తినా బస్సు ఆపేవారు. ఇప్పుడు కుదరదని చెప్పడం సరికాదు.

– కుమారి, బత్తలపల్లి, శ్రీసత్యసాయి జిల్లా

ఆ తల్లి నిర్ణయం.. ఆరుగురికి వరం

- ఒక్కగానొక్క కుమారుడి బ్రెయిన్‌డెడ్
- అవయవ దానానికి తల్లి అంగీకారం



నవీన్(ఫైల్)

చిలమత్తూరు: ఒక్కగానొక్క కుమారుడు. బిడ్డకు మూడు నెలల వయసులోనే భర్త మరణించాడు. అయినా కష్టాలకు ఎదురీది కుమారుణ్ని కంటికి రెప్పలా చూసుకుంది. ఇరవై ఏళ్లు నిండాయి. ఇంటికి పెద్దదిక్కుగా నిలుస్తాడనుకుంది. అయితే విధి మరొకటి తలచింది. కుమారుడు రోడ్డు ప్రమాదానికి గురై బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. ఈ బాధ ఆ తల్లి గుండెను పిండేసింది. ఇంతటి దుఃఖంలోనూ కుమారుడి అవయవదానానికి అంగీకరించింది. వివరాల్లోకి వెళితే... చిలమత్తూరులో ఈ నెల 13న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించగా, తుమ్మలకుంటకు చెందిన నవీన్‌తో పాటు మరొక యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. నవీన్‌ను మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. ఆసుపత్రి వర్గాలు నవీన్ తల్లి గీతతో మాట్లాడి కుమారుడి అవయవాలు దానం చేయాలని అభ్యర్థించారు. ఇందుకు ఆమె అంగీకరించింది. తన బిడ్డ భౌతికంగా దూరమైనా అవయవ దానంతో సజీవంగా ఉంటాడని భావించింది. గుండె, కళ్లు, లివర్, కిడ్నీలను దానం చేసింది. వాటిని వైద్యులు ఆరుగురికి అమర్చి పునర్జన్మ ప్రసాదించారు. ఈ విషయం తెలిసిన పలువురు గీతను ప్రశంసిస్తున్నారు.

సమ్మె చేయండని ఏ గొట్టంగాడు చెప్పాడు!

- ఎంపీడీఓ రమణమూర్తి వివాదాస్పద వ్యాఖ్యలు

చిలమత్తూరు: సమ్మె నోటీసు ఇచ్చేందుకు వెళ్లిన సచివాలయ ఉద్యోగులపై ఎంపీడీఓ రమణమూర్తి నోరు పారేసుకున్నారు. 'ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె చేయండని ఏ గొట్టం గాడు చెప్పాడు' అంటూ సచివాలయ ఉద్యోగులపై ఆయన రెచ్చిపోయిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'సమ్మె గిమ్మె అంటూ తిరిగితే షోకాజ్ నోటీసులు ఇస్తాను జాగ్రత్త' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై సచివాలయ ఉద్యోగులు భగ్గుమంటున్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మెకు సిద్ధమైన సచివాలయ ఉద్యోగులపై ఎంపీడీఓ చేసిన వ్యాఖ్యలను గ్రామ/వార్డు సచివాలయాల దివ్యాంగ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్థ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు సమ్మె హక్కును రాజ్యాంగం ప్రసాదించిందన్నారు. దాన్ని కూడా కాలరాయడం తగదన్నారు. వలంటీర్లు చేయాల్సిన పనులను సచివాలయ ఉద్యోగులతో చేయిస్తూ సీఎం చంద్రబాబు సచివాలయ ఉద్యోగులపై కక్ష తీర్చుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. కించపరిచేలా మాట్లాడిన ఎంపీడీఓ రమణమూర్తి వెంటనే సచివాలయ ఉద్యోగులకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

దొంగ ఓట్లపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



సమావేశానికి హాజరైన ధర్మవరం నియోజకవర్గంలోని బీఎల్‌ఏలు

- వైఎస్సార్ సీపీ మద్దతుదారుల ఓట్లు గల్లంతు కాకుండా చూడాలి
- బీఎల్‌ఏలకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సూచన

ధర్మవరం: దొంగ ఓట్ల విషయంలో అప్రమత్తంగా ఉండటంతో పాటు వైఎస్సార్ సీపీ మద్దతుదారుల ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బీఎల్‌ఏలతో అన్నారు. మంగళవారం ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలకు చెందిన బీఎల్‌ఏ (బూత్ లెవల్ ఏజెంట్)లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి మాట్లాడుతూ... దేశంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరు ఎన్నో అనుమానాలకు తావిస్తోందన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పేరిట ఎన్నికల సంఘం ఓటరు జాబితాను సమీక్షించి కొత్త జాబితాను రూపొందిస్తోందన్నారు. గతంలో బిహార్‌లో ఎస్ఐఆర్ పేరిట విడుదల చేసిన కొత్త జాబితాలో 60 లక్షల దాకా ఓట్లు గల్లంతయ్యాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్ఐఆర్ సర్వే అక్టోబర్ నుంచి మొదలయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సర్వేలో వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు, అర్హులైన ప్రజల ఓట్లు గల్లంతు కాకుండా బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్వే ప్రారంభమయ్యేలోపు అర్హులైన ఓటరు జాబితాను సిద్ధం చేసుకోవాలని బీఎల్‌ఏలకు సూచించారు. తద్వారా ఎన్నికల సిబ్బంది చేసే తప్పులను వెంటనే ఎత్తి చూపవచ్చన్నారు. లేకపోతే అధికార పార్టీ నాయకులు ఎంతకైనా తెగిస్తారన్నారు. 2014 ఎన్నికల్లో 14 వేలకుపైగా దొంగ ఓట్లను ఎక్కించారని, దీన్ని తాను రాష్ట్రస్థాయిలో ఆధారాలతో సహా చూపి టీడీపీ నాయకుల బండారం బయటపెట్టానన్నారు. 2018లోనూ కోర్టులకు వెళ్లి నియోజకవర్గంలో 19 వేల దొంగఓట్లను కట్టడి చేశామన్నారు. 2024 ఎన్నికలకు ఒక నెల ముందు దాదాపుగా 20 వేల ఓట్లు మళ్లీ ఎక్కించారని, ఇలా.. విలువలు పక్కన పెట్టి దొంగఓట్లతో ప్రత్యర్థులు దొడ్డిదారిన గెలుస్తున్నారన్నారు. అందువల్లే బీఎల్‌ఏలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

బీజేపీ గెలుపుతోనే అనుమానాలు

ధర్మవరం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో బీజేపీకి 600 ఓట్ల ఆధిక్యం మాత్రమే వచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీసం ఆ పార్టీ గుర్తుపై కూడా ప్రజలకు ఇప్పటికీ అవగాహన లేదన్నారు. అలాంటి పార్టీ ఎన్నికల్లో గెలవడం ఏమిటని ప్రశ్నించారు. దీన్నిబట్టి చూస్తే ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరు ఎన్నో అనుమానాలను రేకెత్తిస్తోందన్నారు. ఇక గత ఎన్నికల్లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ధర్మవరంలో పర్యటించిన రోజే రాష్ట్ర డీజీపీని మార్చడం... ఎన్నికల ఫలితాలు విడుదలైన పదిరోజుల్లోపే వీవీ ప్యాట్ స్లిప్పులను కాల్చివేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు నిజాయితీగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. అప్పుడే ప్రజాస్వామ్యంపై అందరికీ నమ్మకం కలుగుతుందన్నారు. ఆ దిశగా ప్రభుత్వాలు పని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

యూరియా కొరతపై కన్నెర్ర

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో నిలదీసిన సభ్యులు
- యూరియాను తన్నుకుపోతున్నదెవరో నిగ్గు తేల్చాలని డిమాండ్
- రైతులే అదనంగా తీసుకెళ్తున్నారని ఎంపీ అంబికా వ్యాఖ్యలు
- డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేసి ఆదుకోవాలన్న చైర్‌పర్సన్ గిరిజమ్మ



యూరియా కొరతపై నిలదీస్తున్న జెడ్పీటీసీ సభ్యులు

అనంతపురం సిటీ: యూరియా కొరతపై సభ్యులు కన్నెర్రజేశారు. రైతుల అవసరాలకు తగ్గట్టు యూరియాను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. జిల్లాకు వస్తున్న యూరియా ఎక్కడికెళ్లిపోతోందని నిలదీశారు. యూరియాను తన్నుకుపోతున్న గద్దలెవరో నిగ్గు తేల్చాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల జాయింట్ కలెక్టర్లు శివ్ నారాయణ్ శర్మ, అభిషేక్ కుమార్, సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్య హాజరయ్యారు. యూరియా కొరతపై జిల్లా వ్యాప్తంగా రైతులు ఆందోళనలు కొనసాగిస్తున్న విషయాన్ని జెడ్పీటీసీ సభ్యులు ప్రస్తావించారు. గుమ్మఘట్ట, అనంతపురం రూరల్, చెన్నేకొత్తపల్లి, పరిగి జెడ్పీటీసీ సభ్యులు మహేశ్, చంద్రకుమార్, గోవిందరెడ్డి, శ్రీరామప్ప యూరియా కొరత గురించి ప్రస్తావిస్తూ రైతుల ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. కర్ణాటకలో తక్కువ ధరకే యూరియా దొరుకుతోందని, ఏపీలో ఎందుకు కొరత వస్తోందని నిలదీశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియాను కొందరు దళారులు కుమ్మక్కై పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే అంశంపై అనంతపురం ఎంపీ స్పందిస్తూ కేంద్ర మంత్రి నడ్డాతో మాట్లాడి కావాల్సినంత యూరియా తెప్పిస్తున్నట్లు తెలిపారు. అయితే డిమాండ్ రోజురోజుకూ పెరిగిపోతోందన్నారు. దీనికి కారణం.. అవసరానికంటే ఎక్కువ యూరియాను రైతులు తీసుకెళ్లడమేనని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ స్పందిస్తూ.. రైతుల సమస్యలను సానుకూల దృక్పథంతో అర్థం చేసుకొని డిమాండ్‌కు తగ్గట్టు యూరియా సరఫరా చేసి ఆదుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడుతూ రైతుల అవసరాల మేరకు ప్రభుత్వం యూరియా సరఫరా చేస్తోందని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తమ ప్రాంతంలో మొక్కజొన్న ఎక్కువగా సాగవుతోందని, మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వమే కొనుగోలు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని లేపాక్షి జెడ్పీటీసీ సభ్యుడు శీనురెడ్డి సభ దృష్టికి తెచ్చారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం ఇస్తారో ఇవ్వరో తేల్చాలని రొద్దం జెడ్పీటీసీ సభ్యురాలు హరేసముద్రం పద్మ కోరారు. తల్లికి వందనం రాని వారి జాబితా ఇవ్వాలని జిల్లా విద్యా శాఖాధికారులను అడుగుతున్నా ఎందుకు ఇవ్వడం లేదని బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ సభ్యుడు నీలం భాస్కర్ నిలదీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు కాని వారిచేత జాతీయ పతాకావిష్కరణ చేయిస్తున్నా విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారని అనంతపురం రూరల్ జెడ్పీటీసీ చంద్ర ప్రశ్నించారు. ప్రొటోకాల్ పాటించకపోయినా.. బయటి వ్యక్తులతో జెండా ఆవిష్కరణ చేయించినా చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ హెచ్చరించారు.

ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్‌పై వాగ్వాదం

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ అంశంపై సభలో వాగ్వాదం జరిగింది. బడుగు, బలహీన వర్గాలవారి పాలిట జీవనాడిగా ఉన్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని జిల్లాలోని అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, దళితులు, గిరిజనులు, బీసీలు ఆందోళనలు చేస్తున్నా కేంద్రంలోని బీజేపీ పెద్దలు ఎందుకు స్పందించడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో కీలకంగా ఉన్న బీజేపీ పెద్దలతో ముఖ్యమంత్రి, మంత్రులు ఎందుకు ఒత్తిడి పెంచడం లేదన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ స్పందిస్తూ కేంద్రంలోని పెద్దలందరినీ కలసి విన్నవిస్తున్నామని, ఇక్కడ రాజకీయాలు చేయడం మంచిది కాదని అన్నారు. దీంతో సభ్యులందరూ మూకుమ్మడిగా నిలదీశారు. ఆర్డీటీకి నిధులు వస్తే గానీ పేదల జీవితాల్లో వెలుగులు నిండవని పేర్కొన్నారు. వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో జెడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని సద్దుమణిగించారు.

సర్వజనాస్పత్రిలో అక్రమాలపై ఆందోళన

అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో జరుగుతున్న అక్రమాలు, వ్యవహారాలపై గోరంట్ల, అనంతపురం జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాం నాయక్, చంద్రకుమార్ సభ దృష్టికి తెచ్చారు. ఈసీజీ, సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కానింగ్ సహా విలువైన రక్త పరీక్షలన్నీ పెద్దాస్పత్రిలోనే చేయించాలని ప్రభుత్వం ఆదేశించినా.. యంత్రాలు చెడిపోయాయంటూ రోగులను సత్యం డయాగ్నస్టిక్‌కు ఎందుకు పంపుతున్నారని నిలదీశారు. ప్రతి నెలా రూ.18 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఎందుకు చెల్లించాల్సి వస్తోందని, ఈ వ్యవహారంలో ఎవరెవరికి ఎంతెంత వాటా ముడుతోందని ప్రశ్నించారు. సమాధానం చెప్పాల్సిన సూపరింటెండెంట్ గైర్హాజరు కావడంపై జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీ మండిపడ్డారు. సర్వజనాస్పత్రిలో మహిళా రోగులకు, సహాయకులకు రక్షణ కరువైపోయిందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

'నువ్వ ఉండమ్మా..'

ఆర్డీటీ అంశంపై జెడ్పీటీసీ సభ్యులు ప్రశ్నల వర్షం కురిపిస్తుండగా ఎంపీ అంబికా వారించబోయారు. జోక్యం చేసుకున్న గిరిజమ్మనుద్దేశించి 'నువ్వ ఉండమ్మా.. అంటూ ఏకవచనంతో సంబోధించారు. ఇందుకు గిరిజమ్మ దీటుగా స్పందించారు. జెడ్పీ చైర్‌పర్సన్ హోదాలో సభను నడిపిస్తుంటే ఏకవచనంతో ఎలా మాట్లాడుతారంటూ నిలదీయడంతో ఎంపీ సర్దుకున్నారు. తరువాత గుమ్మఘట్ట ఎంపీపీ భవాని మాట్లాడుతూ తాను దళితురాలినని ఎంపీడీఓ వివక్ష చూపుతున్నారని, జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ దృష్టికి తెస్తే ఎటువంటి చర్యలూ తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఈఓ డొంక తిరుగుడు సమాధానాలు ఇవ్వడంతో మిగిలిన జెడ్పీటీసీ సభ్యులందరూ ఒక్కసారిగా ఎదురు తిరిగారు. ఒక ప్రజాప్రతినిధికి ఇంత అవమానం జరిగితే చూస్తా.. చేస్తా అంటారా అంటూ మండిపడ్డారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, చిత్రంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జేసీ శివ్ నారాయణ్‌శర్మ తదితరులు

క్లుప్తంగా

నేటి నుంచి పోషణ్ మాసోత్సవాలు

పుట్టపర్తి అర్బన్: ఈ నెల 17 నుంచి అక్టోబర్ 17వ తేదీ వరకూ జిల్లాలో పోషణ్ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ ప్రమీల తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్యకరమైన ఆహారాలు, పర్యావరణం, సమానత్వం, సాధికారత, స్థూలకాయ నివారణ తదితర ఐదు అంశాలపై కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులపై పని భారం తగ్గించండి

- స్కూల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు



పాపసాని జెడ్పీ హెచ్ఎస్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర: ఉపాధ్యాయులపై పని భారం తగ్గించి, బోధనకే పరిమితం చేయాలంటూ ప్రభుత్వాన్ని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఏపీ ఎస్టీఏ జిల్లా అధ్యక్షుడు మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డితో కలసి బేగార్లపల్లి, కదిరేపల్లి, పాపసానిపల్లి, సిద్ధగిరి, గుండుమల, మడకశిర పాఠశాలల్లో మంగళవారం ఆయన సభ్యత్వ నమోదు నిర్వహించారు. అనంతరం మడకశిర మండలం వనరుల కేంద్రంలో జిల్లా సబ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ.. యాప్‌ల భారంతో పాటు అసెస్మెంట్ పుస్తకాల నిర్వహణతో పాఠ్యాంశాల బోధనకు సమయం సరిపోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్మెంట్ తదితర బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. నాలుగు పెండింగ్ డీఏలు, 11వ పీఆర్సీ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎస్టీఏ జిల్లా కోశాధికారి ప్రదీప్‌కుమార్, డివిజన్ నాయకులు రమేష్, సురేష్, నాగరాజాచారి, మంజునాథ్, ఉమేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి విఘాతం



కూటమి పాలన వైఫల్యాలను ఎత్తి చూపుతున్న 'సాక్షి' మీడియాపై కూడా రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయడం అన్యాయం. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తూ సాక్షి దిన పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డితో పాటు పలువురు జర్నలిస్టులపై బనాయించిన అక్రమ కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలి. పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేకపోతే ఖండించాలి కానీ కేసులతో భయపెట్టాలనే ఆలోచన దుర్మార్గం. సాక్షి పత్రిక విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలి.

– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం



అక్రమ కేసులు ఎత్తివేయాలి



ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తున్నారనే అక్కసుతో కక్ష కట్టి సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి, విలేకరులపై అక్రమ కేసులు బనాయించారు. ఇది సరి కాదు. గత ప్రభుత్వంలో అక్రమంగా కేసులు బనాయిస్తున్నారంటూ నాడు గగ్గోలు పెట్టిన టీడీపీ పెద్దలు.. నేడు వారు చేస్తున్నదేమిటో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు రాజ్యాంగ విరుద్ధం.

– ఈ.కుళ్లాయిస్వామి, జిల్లా ప్రధానకార్యదర్శి, ఏఐఎస్ఎఫ్

'మెరిట్' లిస్ట్.. 'సెలక్షన్' ట్విస్ట్

- డీఎస్సీ–2025 నియామక ప్రక్రియలో గందరగోళం
- ఒకే కేటగిరీలో వెనకున్న అభ్యర్థులను ఎంపిక చేసిన అధికారులు
- వైకల్యమే లేకున్నా దివ్యాంగుల కోటాలో ఉద్యోగం



ఎంపిక జాబితాలో తన పేరు లేకుండా తనకంటే వెనకున్న 8 మంది పేర్లు ఉన్నాయంటూ డీఈఓకు విన్నవిస్తున్న అభ్యర్థి ఆంజనేయులు

అనంతపురం ఎడ్యుకేషన్: మెరిట్ జాబితాలో ముందున్న అభ్యర్థుల కంటే వెనుక ఉన్న వారు పోస్టులకు ఎంపికవడంతో అర్హులైన డీఎస్సీ – 25 అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. పారదర్శకత పేరుతో అభ్యర్థులకు పూర్తిస్థాయి సమాచారం చేరవేయకుండా రాష్ట్రస్థాయి అధికారులే ఎంపిక ప్రక్రియ చేపట్టడం వివాదానికి కారణమైంది. ఒక పోస్టుకు ఒక అభ్యర్థినే ఎంపిక చేసి సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. ఒక్కటెండు కాదు.. మొత్తం 5 సార్లు నిపుణులతో సర్టిఫికెట్ల పరిశీలన చేయించారు. కాల్‌లెటర్లు అందని అభ్యర్థులు, ఏవైనా సర్టిఫికెట్లు పొందుపరచని వారు ఉంటే చివరి విడత వరకూ అవకాశం కల్పించారు. అయినా అర్హులు అనర్హులుగా, అనర్హులు అర్హుల జాబితాలో కనిపిస్తుండడంతో ఆందోళన మొదలైంది.

తనకంటే వెనకున్న వారిని ఎంపిక చేశారంటూ..

బీసీ–ఏ కేటగిరీకి చెందిన ఎ.ఆంజనేయులు స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ మెరిట్ జాబితాలో 48వ ర్యాంకులో ఉన్నాడు. సర్టిఫికెట్ల పరిశీలన రోజు ఒరిజినల్ పత్రాలు లేని కారణంగా ఫ్రీజింగ్ జాబితాలో ఉంచారు. గడువు లోపు ఎస్‌వీయూకు వెళ్లి ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొచ్చి అధికారులకు అందజేయడంతో అన్‌ఫ్రీజ్ చేసి అర్హత జాబితాలో ఉంచారు. చివరకు అతని కంటే తక్కువ మార్కులు, తక్కువ ర్యాంకు వచ్చిన వారికి ఉద్యోగం వచ్చింది. సెలక్షన్ జాబితాలో ఆంజనేయులు పేరు మాయమైంది. ఇలా అతని కంటే వెనకున్న 8 మందిని అర్హుల జాబితాలోకి చేర్చడం అనుమానాలకు తావిస్తోంది. అలాగే ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్, పీఈటీ రెండు పోస్టులకూ ఎంపికైన చంద్రిక.. కేజీబీవీలో పని చేస్తూ బీపీఈడీ చేసిందనే నెపంతో ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టు కాకుండా యూజీపీడీ అర్హతతో పీఈటీ పోస్టుకు ఎంపిక చేశారు. తుది జాబితాలో మాత్రం అమె కంటే తక్కువ మార్కులు వచ్చిన వారి పేర్లు కనిపిస్తున్నా.. చంద్రిక పేరు మాత్రం లేదు. తమకు జరిగిన అన్యాయంపై వీరిద్దరూ డీఈఓకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అనర్హుడికి దివ్యాంగుల కోటాలో ఉద్యోగం

కె.శ్రీనివాసులు అనే వ్యక్తి మానసిక అనారోగ్యం (ఎంఐ) కేటగిరీలో మెరిట్ జాబితాకు ఎంపికయ్యాడు. వెరిఫికేషన్ సమయంలో 70 శాతం వైకల్యం ఉన్నట్లు మెడికల్ సర్టిఫికెట్ చూపించాడు. ఆ సర్టిఫికెట్ ఆధారంగా వెరిఫికేషన్ బృందం తుది నిర్ధారణగావించి అప్‌లోడ్ చేసింది. అనంతరం మెడికల్ సర్టిఫికెట్ ధ్రువీకరణ కోసం అతడిని సర్వజనాస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేయకముందే శ్రీనివాసులు ఉడాయించాడు. ఇంతలో మతలబు ఏమి జరిగిందో ఏమో కానీ నేరుగా విజయవాడకు వెళ్లి విద్యాశాఖ కమిషనర్‌ను కలిసి, మళ్లీ వైద్య పరీక్షలు చేయించాలంటూ అక్కడి నుంచి ఆదేశాలు తీసుకొచ్చాడు. దీంతో డీఈఓ స్వయంగా రంగంలోకి దిగి సదరు అభ్యర్థిని సర్వజన ఆస్పత్రికి తీసువెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. ఎలాంటి మానసిక ఆరోగ్యం లేదని వైద్యులు ధ్రువీకరించారు. వైకల్యశాతం '0'గా నిర్ధారించారు. ఈ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేసి అనర్హుడిగా నిర్ధారించాల్సి ఉంది. మరి ఏమి జరిగిందో తెలియదు కానీ ఆయనకు మాత్రం ఉద్యోగం వచ్చింది. ఆస్పత్రి నుంచి ఉడాయించిన రోజే మెడికల్ టెస్ట్‌కు గైర్హాజరు కారణంగా అనర్హుడి జాబితాలో ఉంచాలని డీఈఓ ఆదేశించినా.. వెరిఫికేషన్ బృందం ధిక్కరిస్తూ అర్హుడి జాబితాలో ఉంచడం వెనుక ఆంతర్యమేమిటి? దీని వెనుక ఎవరు చక్రం తిప్పారనే చర్చ జోరుగా జరుగుతోంది.

20 మందికి పైగా అభ్యర్థుల పేర్లు గల్లంతు

జిల్లా అధికారుల వద్ద సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరై పోస్టులు రాని వారు దాదాపు 20 మందికిపైగా ఉన్నారు. వాస్తవానికి ఒక పోస్టుకు ఒక అభ్యర్థినే సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. కాల్‌లెటర్లు అంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినా తుది జాబితాలో వారి పేర్లు కనిపించలేదు. మరి ఇంత మంది సెలక్షన్ జాబితాలో ఎందుకు లేరనేది అంతు చిక్కని ప్రశ్నగానే మిగిలింది. ఈ లాజిక్ పీటముడి అధికారులకే తెలియాలని అభ్యర్థులు వాపోతున్నారు. ఈ క్రమంలో పలువురు అభ్యర్థులు డీఈఓ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. వారు ఇస్తున్న అర్జీలను తీసుకుంటూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఈఓ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు.

ఎంపికైన అభ్యర్థులూ తరలిరండి : డీఈఓ

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ–25లో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులందరూ ఈ నెల 19న అమరావతిలో జరిగే సమావేశానికి హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు. మంగళవారం తన చాంబరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపికైన అభ్యర్థితో పాటు తోడుగా మరొకరు విజయవాడకు రావచ్చన్నారు. ప్రయాణ ఖర్చులు, వసతి, భోజన సదుపాయాలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. 18న ఉదయం 6 గంటలకు అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులోని పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవాలన్నారు. ప్రతి బస్సుకు నలుగురు చొప్పున లైజన్ ఆఫీసర్లను నియమిస్తామన్నారు. 19న మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సీఎం చంద్రబాబుతో మీటింగ్ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరికీ కిట్టుతో పాటు అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందజేస్తారని, అదే రోజు రాత్రి బయలుదేరి మరుసటి రోజు ఉదయం జిల్లాకు చేరుకుంటారన్నారు.

ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం

- ఏపీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్
- జిల్లా అడహాక్ కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

పుట్టపర్తి టౌన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్లపాటి విద్యాసాగర్ అన్నారు. మంగళవారం ఎన్జీఓ నాయకులు పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆర్‌వీజే కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా నాయకుడు లింగా రామ్మోహన్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అడహాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్లపాటి విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ కట్టుబడి ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం త్వరలోనే ప్రకటిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి చాలా సమస్యలున్నాయని, వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చన్న నమ్మకంతో ఉన్నామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటమే శరణ్యమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణతోపాటు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా నూతన అడహాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా లింగా రామ్మోహన్, కమిటీ సభ్యులుగా శంకరనారాయణ, కదిరి వేణుగోపాల్‌రెడ్డి, లలితమ్మ, లోకేశ్వర్‌రెడ్డి, ఈశ్వరప్ప తదితరులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి ఉద్యోగులు, సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. పూలమాలలు, శాలువతో సత్కరించారు.

'వందేభారత్'కు అంతరాయం

గుంతకల్లు: బెంగళూరు నుంచి కలబురిగి వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు అంతరాయం ఏర్పడింది. గుంతకల్లులోని ధర్మవరం ఎల్‌సీ గేట్ వద్ద మంగళవారం సాయంత్రం వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, గూడ్స్ రైలు రాకపోకలు సాగించాయి. ఈ నేపథ్యంలో గేట్ తరుచూ వేయడంతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో వాహనాదారులు విసుగెత్తిపోయారు. అదే సమయంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ వస్తుండగా మరోసారి గేట్ వేయడానికి ప్రయత్నిస్తుండగా ట్రాఫిక్ జామ్ అయి గేట్ వేయడానికి సాధ్యపడలేదు. దీంతో ధర్మవరం గేట్ సమీపంలో దాదాపు 15 నిమిషాల సేపు వందేభారత్‌ను నిలబెట్టేశారు. అనంతరం వాహనాదారులను బతిమలాడుకుని గేట్ వేయడంతో రైలు ముందుకు కదిలింది.

జక్కల ఆదిశేషు కుటుంబానికి పరామర్శ



బొంతలపల్లిలో జక్కల ఆదిశేషు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

తనకల్లు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, నల్లమాడ మాజీ జెడ్పీటీసీ జక్కల ఆదిశేషు కుటుంబాన్ని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పరామర్శించారు. తనకల్లు మండలం బొంతలపల్లికి మంగళవారం చేరుకున్న ఆయన ఆదిశేషు భార్య, జెడ్పీటీసీ సభ్యురాలు జక్కల జ్యోతి, కుటుంబ సభ్యులు బొడ్డు నాగరాజు, అరుణను ఓదార్చారు. అనంతరం ఆదిశేషు సమాధి వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ కదిరి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, జిల్లా ఉపాధ్యక్షుడు బైక్ భాస్కర రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, నాయకులు రామ్‌దేశాయ్, మాజీ ఎంపీటీసీ రాందాస్, చలపతి, రవి, స్టోర్ వెంకటరెడ్డి, గౌస్, మండల కమిటీ సభ్యులు కరే నరేంద్ర, బాబ్జాన్, సూరి, రెడ్డిశేఖర్‌రెడ్డి, తాహీర్, ఖాదర్‌వలి, సర్వేశ్వరరెడ్డి, సలీం, నారాయణరెడ్డి, యశ్వంత్‌రెడ్డి, రామమోహన్, మహేష్‌రెడ్డి, బాబు, నాగిరెడ్డి, గణేష్, హైదర్‌వలి, చాకివేలు రమణ, కిరణ్, నరసింహులు, నీలకంఠారెడ్డి, కిష్టప్ప, రామాంజి, కొండయ్య, నల్లచెరువు మండల నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, దశరథనాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మేసి..దాడి చేసి

- బుక్కపట్నం 'శ్రీసంతోషి' సంఘం నిధులు స్వాహా
- రూ.7.5 లక్షలు సొంతానికి వాడుకున్న మాజీ లీడర్ కోమల
- తిరిగి చెల్లించాలని కోరిన సభ్యులు, సీపీఎం నాయకులపై దాడి
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు



బుక్కపట్నం స్త్రీ శక్తి భవనం ముందు నిరసన తెలుపుతున్న పొదుపు సంఘం మహిళలు



దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకులు

పుట్టపర్తి: పొదుపు సంఘంలోని నిధులను సభ్యులకు తెలియకుండా స్వాహా చేసిన ఓ మాజీ లీడర్... డబ్బు తిరిగి కట్టాలని కోరిన సంఘం సభ్యులపై, వారికి మద్దతు తెలిపిన సీపీఎం నాయకులపై బంధువులతో కలిసి దాడులకు దిగారు. ఈ ఘటన బుక్కపట్నంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బుక్కపట్నంలోని శ్రీసంతోషి మహిళా సంఘానికి గతంలో కోమల అనే మహిళ లీడర్‌గా ఉండేది. ఈక్రమంలో 8 నెలల క్రితం ఆమె సభ్యులకు తెలియకుండా సంఘం నిధులు రూ.7.50 లక్షలు సొంతానికి వాడుకుంది. ఆలస్యంగా ఈ విషయం తెలుసుకున్న సంఘం సభ్యులు ఆమెను లీడర్‌గా తొలగించడంతో పాటు సొంతానికి వాడుకున్న నిధులు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. అప్పుడు నెల రోజులు గడువు కోరిన కోమల... ఆ తర్వాత కూడా డబ్బు చెల్లించలేదు. ఈ క్రమంలో చాలాసార్లు సంఘం సభ్యులు కోమలను డబ్బుకోసం నిలదీయడం ఆమె ఎదురుదాడికి దిగడం జరిగాయి. ఇప్పటికి 8 నెలలు దాటినా కోమల డబ్బు చెల్లించలేదు. దీంతో సోమవారం రాత్రి సంఘం సభ్యులంతా కలిసి కోమల ఇంటి వద్దకు వెళ్లారు. సంఘం డబ్బులు రూ.7.50 లక్షలు చెల్లించాలని కోరారు. అంతవరకూ అక్కడి నుంచి కదిలేది లేదని చెప్పారు. దీంతో కోమల, ఆమె కుటుంబీకులు సంఘంలోని సభ్యులైన మహిళలపై దాడి చేశారు. దీంతో వారంతా సోమవారం రాత్రే బుక్కపట్నం పోలీసు స్టేషన్‌కు వెళ్లి వారిపై ఫిర్యాదు చేశారు.

వెలుగు కార్యాలయం ముందు ధర్నా

మంగళవారం ఉదయం కూడా శ్రీసంతోషి మహిళ సంఘం సభ్యులు స్థానిక స్త్రీశక్తి భవనం ముందు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం మహిళలకు మద్దతుగా సీపీఎం జిల్లా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈ.ఎస్ వెంకటేష్, బ్యాళ్ల అంజి తదితరులు కార్యాలయానికి వెళ్లి కోమల స్వాహా చేసిన నిధులు తిరిగి కట్టించాలని కోరారు. అయితే కోమలకు మద్దతుగా నిలిచిన యానిమేటర్ నాగరాజు, సిబ్బంది సీపీఎం నాయకులను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు దాడికి పాల్పడ్డారు. దీంతో వారు బుక్కపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు స్వాహా అయిన నిధులు తిరిగి రికవరీ చేయాలని కోరారు. ఈ ఘటనపై 'వెలుగు' సీసీ రవిని వివరణ కోరగా... శ్రీసంతోషి పొదుపు సంఘంలోని డబ్బులు స్వాహా జరిగిన మాట వాస్తవమేనన్నారు. ఆ సొమ్ము రికవరీ చేయాలని కోమల అనే మాజీ లీడర్‌ను పీడీ ఆదేశించారని, సీపీఎం నేతలు, యానిమేటర్లు ఇరు వర్గాలు తోపులాడుకుంటుంటే తాము వారిని సముదాయించామన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: మహిళల ఆరోగ్యం కోసం బుధవారం నుంచి జరిగే ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలని వైద్యాధికారులకు స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమ స్టేట్ నోడలాఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజాబేగంతో కలసి వైద్యాధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా అన్ని శాఖల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అక్టోబర్ 2 వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణే ప్రధాన లక్ష్యం

హిందూపురం: మండలంలోని బేవనహళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డాక్టర్ అనిల్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా మాతా శిశు సంరక్షణ సేవలు, వివిధ రకాల పరీక్షలు, పౌష్టికాహారం, ఉచిత మందుల పంపిణీ తదితరాలపై ఆరా తీశారు. అక్టోబరు 2వ తేదీ వరకూ జరిగే మహిళల ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. డీఐఓ నాగేంద్రనాయక్, పీఓ సునీల్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ పద్మజ, ఎంహెచ్ఓ మల్లప్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగుడుకు డబ్బు ఇవ్వలేదని..

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీ పరిధిలోని దండోరా కాలనీలో నివాసముంటున్న గోవిందు (55) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. పెయింటింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. భార్య కూలి పనులకు వెళ్లేది. ఈ క్రమంలో తాగుడుకు బానిసైన గోవిందు... నిత్యం మద్యం మత్తులో జోగుతూ జులాయిగా మారాడు. మద్యం తాగేందుకు డబ్బు కావాలని సోమవారం సాయంత్రం భార్యతో గొడవపడ్డాడు. ఆమె ఇవ్వక పోవడంతో రాత్రి గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద మృతి



సుబేద్ మృతదేహం

సోమందేపల్లి: మండలంలోని పత్తికుంటపల్లి బస్టాండ్ సమీపంలో మోరీ కింద ఓ గుర్తు తెలియని వ్యక్తి (45) అనుమానాస్పద స్థితిలో మృతదేహమై కనిపించాడు. మంగళవారం అటుగా వెళ్లిన గ్రామస్తులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ముక్కులో రక్తం రావడంతో పాటు శరీరంపై మూగ దెబ్బలను గుర్తించారు. విచారణ అనంతరం మృతుడిని హిందూపురం ప్రాంతానికి చెందిన సుబేద్‌గా నిర్ధారించారు. ఏదైన గొడవలో గాయపడి మృతి చెందడంతో మృతదేహాన్ని మోరీ కింద పడేసి వెళ్లారా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే అది సాధారణ మరణమేనని పోలీసులు పేర్కొన్నారు.

- పుట్టపర్తి టౌన్: స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని బ్రాహ్మణపల్లి జగనన్న కాలనీలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతదేహమై కనిపించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. బ్రాహ్మణపల్లి తండాకు చెందిన నారాయణ నాయక్ కుమారుడు బాలాజీ నాయక్ (38)కు భార్య గాయత్రి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో మంజూరైన ఇంటిలో నివాసముంటూ పెయింటింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. సోమవారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం భార్యాపిల్లలతో కలసి మిద్దెపై నిద్రకు ఉపక్రమించాడు. అర్ధరాత్రి సమయంలో భార్య గట్టిగా కేకలు పెట్టడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే బాలాజీనాయక్ తలపై సిమెంట్ దిమ్మెతో మోది మిద్దె పైనుంచి కిందకు తోసేయడాన్ని గమనించి, కుటుంబ సభ్యులతో కలసి ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న సీఐ శివాంజనేయులు మంగళవారం ఉదయం జగనన్న కాలనీకి చేరుకుని ఇంటి పరిసరాలను పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, భార్య గాయత్రి, ఆమె తల్లిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

బీటెక్ విద్యార్థిని బలవన్మరణం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న ధనలక్ష్మి (20) అదే కళాశాల హాస్టల్ గదిలో మంగళవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుంది. గదిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మిస్టరీ వీడేదెన్నడు?

- 2021లో కదిరిలో నగల వ్యాపారి కిరణ్ హత్య
- 2022లో హతమైన కిరాణా దుకాణం యజమాని ప్రమీల
- నేర పరిశోధనలో చతికిలపడిన పోలీసులు
- ఖాకీల ప్రమేయంతోనే హత్యలంటూ ఊహాగానాలు
- నూతన ఎస్పీకి సవాల్‌గా మారిన పెండింగ్ కేసుల దర్యాప్తు



కిరణ్ (ఫైల్)



ప్రమీల (ఫైల్)

కదిరి: రెండు వేర్వేరు కీలక హత్య కేసుల్లో మిస్టరీని ఛేదించడంలో పోలీసులు చతికిల పడ్డారు. ఆ రెండు కేసులను లోతుగా దర్యాప్తు చేస్తే ఒకరిద్దరు పోలీసు అధికారులు సైతం జైలుకెళ్లాల్సి వస్తుందనే ఆరోపణలు బలంగా వినబడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ హత్యలు జరిగి మూడు, నాలుగేళ్లు కావస్తున్నా నేటికీ దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది. రెండు రోజుల క్రితం జిల్లా ఎస్పీగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్.సతీష్ కుమార్ ఈ రెండు కేసుల దర్యాప్తు సవాల్‌గా నిలిచాయి. ప్రత్యేక చొరవ చూపి, నిందితులకు శిక్ష పడేలా చూడాలని బాధిత కుటుంబసభ్యులు కోరుతున్నారు.

గదిలోనే కిరణ్ దారుణ హత్య

మహారాష్ట్రకు చెందిన కిరణ్(23) కొన్నేళ్లుగా కదిరి పట్టణంలోని ఎంజీ రోడ్డులో మేడపై ఓ గదిని అద్దెకు తీసుకొని బంగారు నగలు తయారీతో జీవనం సాగించేవాడు. సకాలంలో నగలు సిద్ధం చేసి ఇస్తుండడంతో నగల వ్యాపారులందరూ అతనికే పని ఇచ్చేవారు. దీంతో రోజంతా బిజీగా ఉంటూ పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాడు. అతని వద్ద కిలోకు పైగా బంగారం, 10 కిలోలకు పైగా వెండి ఉండేదని కొందరు నగల వ్యాపారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో 2021 సెప్టెంబర్ 12న రాత్రి తన గదిలో నిద్రిస్తుండగా కిరణ్‌ను కొందరు వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. మొదట్లో ఈ కేసు విషయంలో పోలీసులు కొంత హడావుడి చేసినా ఆ తర్వాత ఉన్నఫళంగా దర్యాప్తు ఆగిపోయింది. ఈ కేసు విచారణలో భాగంగా అప్పటి ఓ పోలీసు అధికారి తన చేతి వాటం ప్రదర్శించి పెద్ద మొత్తంలో నగదు, బంగారు నగలు సొమ్ము చేసుకున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలపైనే సదరు పోలీసు అధికారిని వీఆర్‌కు అప్పట్లో ఉన్నతాధికారులు పంపినట్లుగా సమాచారం.

ప్రమీల శరీరంపై 26 కత్తిపోట్లు

కదిరిలోని కాలేజీ రోడ్డులో కిరాణా కొట్టు నిర్వహించే రంగారెడ్డి అనే వ్యక్తి ఆరేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. ఆ తర్వాత అతని భార్య ప్రమీల(24) ఇంట్లోనే ఉంటూ కిరాణా దుకాణం నిర్వహించేది. 2022, మార్చి 21న అర్ధరాత్రి తన కిరాణా కొట్టులోనే ఆమె దారుణ హత్యకు గురయ్యారు. ఆమె శరీరంపై 26 కత్తిపోట్లు ఉన్నట్లు పోస్టుమార్టం నివేదిక స్పష్టం చేసింది. తన సమీప బంధువులతో ఆస్తి తగాదా విషయంలో అప్పట్లో తరచూ పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళుతున్న ఆమె అమాయకత్వాన్ని అప్పటి ఒక పోలీసు అధికారి 'క్యాష్' చేసుకోవడంతో పాటు వివాహేతర సంబంధం కూడా కొనసాగించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రమీల సెల్‌ఫోన్‌కు అందిన కాల్స్ ఆధారంగా సదరు పోలీసు అధికారి తరచూ ఆమెతో మాట్లాడినట్లు అప్పట్లో పోలీసుల విచారణలో వెలుగు చూసింది. దీంతో సదరు పోలీసు అధికారిని అప్పట్లో విధుల నుంచి తప్పించినట్లుగా పోలీసు వర్గాల సమాచారం. కాగా, సదరు పోలీసు అధికారి అప్పట్లో స్థానిక సబ్‌జైలు ఎదురుగా ఉన్న పోలీస్ గెస్ట్ హౌస్‌లోనే ఉండేవారు. ఆయనకు ప్రమీల తన ఇంటి నుంచి క్యారియర్ తీసుకెళ్లి ఇస్తుండడం తాము కళ్లారా చూశామని కొందరు పోలీసులు సైతం అంగీకరిస్తున్నారు. అలాంటి మహిళ రాత్రికి రాత్రి హత్యకు గురి కావడం నమ్మలేక పోతున్నామని వారంటున్నారు. ఆమె సమీప బంధువులు సైతం ఇదే అంశాన్ని బలపరుస్తున్నారు. ఈ హత్య జరిగి మూడేళ్లకు పైగా కావస్తున్నా నిందితులను ఇప్పటి వరకూ ఎందుకు అరెస్ట్ చేయలేదని బంధువులు ప్రశ్నిస్తున్నారు. ఈ రెండు కేసుల్లోనూ కొందరు ఖాకీల పాత్ర ఉన్నందునే విచారణ పక్కదారి పట్టినట్లుగా బలమైన విమర్శలున్నాయి.